ఓంశ్రీసాయిరాం

ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమప్రేమతో సంధింపనీమమగును
కాన ప్రేమను గట్టిగా కలిగియున్న
అద్వితీయమునొందంగ అర్హుడగును

నమోక్షే నాకాశపుష్పే నపాతాళే భూతలే
అజ్ఞాన హృదయగ్రంధే ర్నాశే మోక్ష ఇతి శృతిః.

ప్రేమస్వరూపులారా!

మోక్షమన్నది ఆకాశమునుండి ఉట్టిపడదు. పాతాళలోకమునుండి పుట్టి రాదు. భూమినందు మనకు లభ్యము కాదు. అజ్ఞానము మనసుండి దూరముగావించుకున్నప్పుడే యిట్టి పవిత్రమైన మోక్షము మనకు లభ్యమౌతుంది.

జంతూనాం నరజన్మ దుర్లభం. మానవజన్మ చాలా ఉత్కృష్టమైనది. సౌజన్యమైనది. సౌశీల్యమైనది. అనేక జన్మల పుణ్యఫలము పోగుచేసి అందించి అందుకొన్న జన్మము మానవజన్మము. ఎంత తపస్సో చేసి, ఎన్ని ప్రార్థనలో సల్పి, ఎన్ని శ్రమలకో ఓర్చి, తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగివస్తున్నది ఈ మానవ జీవితము. ఇంత శ్రమించి ఫలించిన ఈ మానవ జన్మమును సార్థకము గావించుకొనక నిరర్థకము చేసుకుంటున్నాము యీనాడు. ఈ మానవజన్మయొక్క ఉత్కృష్టత ఏమిటి? దీని లక్ష్యము ఏమిటి? దీని గమ్యము ఏమిటి? ఎందు నిమిత్తమై మనము మానవజన్మ ధరించాము? ఈ సత్యము ప్రతి మానవుడు కూడా గుర్తించవలసిన అవసరముంది. కానీ, దురదృష్ట వశాత్తూ, మానవజన్మ లభ్యమై కూడను ఇట్టి పవిత్రమైన తరుణమునందు దీనిని సద్వినియోగపరచుకోలేక పోతున్నాము. ఈ విశాల ప్రపంచమందు పశుపక్షిమృగాదులు, క్రిమికీటకాదులు, చీమదోమలు తమతమ కర్తవ్యములు తాము నిర్వర్తించుకుంటున్నాయి. కౄరమృగములుకూడా తమ కర్తవ్యములు తాము నిర్వర్తిస్తున్నాయి. కానీ, మానవుడు తన కర్తవ్యమును తాను నిర్వర్తించటం విస్మరించాడు. కాలము ప్రచండ మారుతము వలె అతివేగముగా కదలిపోతున్నది. దేహమునకు కేటాయించిన ఆయుఃప్రమాణము మంచుగడ్డ వలె కరగిపోవుచున్నది. కానీ, మానవుడు తన కర్తవ్యమును తాను గుర్తించకపూర్వమే కాయము వదలి వెళ్ళిపోతున్నాడు. మానవజన్మము లభ్యమై ప్రయోజనము ఏమిటి? ఈ మానవజన్మ ఉత్కృష్టత ఏమిటి? నరజన్మ దుర్లభం, ఏమిటా దుర్లభము? ఈ సత్యమును మానవుడు యేమాత్రమూ విచారించటము లేదు. గుర్తించటము లేదు. ప్రవర్తించటం లేదు.

మానవజన్మ చాలా పవిత్రమైనది. ఇంత పవిత్రమైన జన్మను మనము యేంతో సద్వినియోగము చేసుకోవాలి. కానీ, ఈ సదుపయోగం జరగటం లేదు. మన కర్మమును, కాలమును, కాయమును వ్యర్థము గావించు కుంచున్నాము. కారణం ఏమిటి? ఈ భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన ఈ విషయభోగములందే మన జీవితమును అంకితము గావించుకుంటున్నాము. ఈ ప్రాకృత ధర్మములందే మన జీవితము అంకితము గావించి, ఇదే మన లక్ష్యమని భావించి. ఇదే మన గమ్యమని విశ్వసించి సత్యాన్ని గుర్తింకోలేక పోతున్నాము. ఇవన్నీ ప్రవృత్తి లక్షణాలు. ఇవన్నీ ప్రవృత్తి గుణములే. కానీ మానవుని సహజ లక్షణము నివృత్తి తత్త్వము. నిత్యసత్యమైన ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఈనాడు విస్మరించి లౌకిక, భౌతిక, ప్రాకృతమైన అనిత్యము, అశాశ్వతము అయిన జీవితమును అంకితము గావిస్తున్నాము. ఎన్ని చదువులు చదివి యేమి ప్రయోజనము?

ఎన్ని చదువులు చదివి యేమి ఫలము?
తన్నోసట వ్రాత తప్పింప నెవరి తరము?
చెడ్డబుద్ధులు తన తల చేరెనేని
ఎండబారును బుద్ధులు బండబారు.

ఏమి ఈ విద్యల వల్ల లభించే ఫలము? ఈ విద్యల వల్ల మనము ఏమి సాధిస్తున్నాము? రావణుడు అరువదినాలుగు విద్యలు నేర్చాడు. భస్మాసురుడు ఎంతో విద్యావంతుడే. కంసుడు చాలా తెలివితేటలు గలవాడు. రావణుడు ఎంతో తపస్సు చేస్తూ వచ్చాడు. శివార్చన చేస్తూ వచ్చాడు. ఇవన్నీ ప్రాకృతమైన మనోభావముల చేతనే సల్పుతూ వచ్చాడు. భౌతికమోహములో అర్చనలు గావిస్తూ వచ్చాడు. ఎన్ని విద్యలు నేర్చినప్పటికీ, ఎంత తపస్సు ఆచరించినప్పటికీ, ఎన్ని సాధనలు సల్పినప్పటికీ, ఎంత మంత్రము ఉచ్చరించినప్పటికీ రావణుని రాక్షస గుణము మారలేదు. మనోమందిరమునందు దివ్యభావములు నింపుకున్నప్పుడే ఈ ప్రాకృభావములు దూరమౌతాయి. ఈనాటి మానవుడు మనసు నిండుకు ప్రాకృతమైన భావములు నింపుకుంటున్నాడు. అశాశ్వతమైన తలంపులతో జీవితము గడుపుతున్నాడు. నిత్యసత్యమైన శాశ్వతానందము మనకు ఎట్లా లభ్యమవుతుంది? ఇది కాదు. మన హృదయమును పవిత్రముగా వుంచుకోవాలి. ఈ హృదయమునిండుకు ప్రేమను నింపుకోవాలి. ఈ ప్రేమచేత పవిత్రమైన జ్ఞానము పండించుకోవాలి. మానవకోటి మధ్య ప్రేమబీజము నాటి సహన ప్రసూనములు వికసింపజేసి శాంతిఫలములు సమాజమునకందించేదే ఈనాటి యువకుల ప్రధాన లక్ష్యముగీ వుంటుండాలి. సమాజమునకు శాంతిఫలములందించే విద్యార్థులుగా తయారుకావాలి. ఈనాడు సమాజము శాంతి నిమిత్తమై అనేకవిధములుగా కాచి వున్నది. అయితే శాంతిభద్రతలు బయట ప్రపంచములో లేవు. శాంతిభద్రతలు తనయందే వున్నవి. సర్వమూ తనయందే వున్నది. కానీ, ఆ సత్యమును మానవుడు మర్చిపోతున్నాడు. స్వస్వరూపమును విస్మరించి, బాహ్యరూపమును విశ్వసించి కేవలము అనిత్యమైన భావములచేత ప్రపంచములో అన్వేషణ జరుపుతున్నాడు మానవుడు. సర్వంఖల్విదంబ్రహ్మ. ప్రపంచమంతయూ బ్రహ్మస్వరూపమే. బ్రహ్మ లేని స్థానముగానీ, బ్రహ్మ కాని నామముగానీ జగత్తులో మనకు కానరాదు, వినిపించదు. చూచే చూపులు, వినే శబ్దములు, అనుభవించే అనుభూతులు యివన్నీ బ్రహ్మానుభూతులే. కంటికి కనుపించునది, చెవులకు వినిపించునది, మనసుకు అనిపించునది, హృదయానికి అనిపించునది ఈ బ్రహ్మతత్త్వమే. కనుక, మమాత్మా సర్వభూతాంతరాత్మ అనే సత్యము చక్కగా అందరు అర్తము చేసుకుంటే ఈవిధమైన అల్లకల్లోలములకు అవకాశమే వుండదు ప్రపంచములో. జగత్తునందు ఎక్కడ చూచినా కలతలు, కల్లోలములు, కలహములు, ఘోరకృత్యములు జరుగుతున్నవి. ఎవడు మానవుడో, ఎవడు దానవుడో గుర్తించటానికి వీలులేకుండా వుంటున్నాది. ఎవరు సజ్జనులో, ఎవరు దుర్జనులో అనేది కూడా అర్థము చేసుకోలేకపోతున్నారు. పశువీత్వమునుంచి వచ్చిన మానవత్వము, మానవత్వమునుంచి వచ్చిన దివ్యత్వమునకు పోవలసిన నరుడు కేవలం మానవత్వమునుండి పశుత్వమునకు తిరిగి పోతున్నాడు. కాదుకాదు. ఇది కాదు మానవుని ప్రధాన కర్తవ్యము. మానవతా ధర్మములను ఆచరణలో పెట్టాలి.

సత్యం మాతా పితా జ్ఞానం ధర్మో భ్రాత దయా సఖీ
శాంతం పత్నీ క్షమా పుత్రా

జనులకు నిజమైన బంధువులు యివియే. నిజమైన తల్లి సత్యమే. సత్యమునకు మించినది మరొకటి లేదు. త్రికాలబాధ్యం సత్యం. దీనిని మార్చుటకు దేశకాలపరిస్థితుల ప్రభావము ఏమాత్రమూ పనికిరావు. అట్టి నిత్యసత్యమైన దివ్యత్వమును మనము ఈనాడు మరచిపోయినాము. దివ్యత్వమును దర్శించాలంటే ప్రత్యేక పరిశ్రమలు చేయనక్కరలేదు. పైన కప్పిన అహంకారమమకారములను దూరం చేసినప్పుడే సత్యము మనకు సాక్షాత్కరిస్తుంది. ఈనాడు మానవుని ఆవరించిన మహాగ్రహములు కేవలం రెండే, రాగద్వేషములు. ఈ రాగద్వేషములను మనము నిర్మూలము గావించితిమా మనకు మనమే బ్రహ్మము. సర్వం విష్ణుమయం జగత్. జగత్తంతా దైవస్వరూపకంగా రూపొందుతుంది. అలాంటి దివ్యత్వము యే కించిత్తైనా తెలుసుకోటానికి ప్రయత్నించాలి.

విద్యార్థులారా! ఆధ్యాత్మికమంటే మీకు శ్రమగా కనిపిస్తుంది. మీరు నేర్చే విద్యలకంటె సులభమైనది. లౌకిక విద్యల కంటె ఆధ్యాత్మిక విద్య అత్యంత సులభమైనది. తెలుసుకోలేకపోవటం వలన యిది కష్టముగా కనిపిస్తున్నాది.

A B C D లు నేర్చుకంటున్నప్పుడు మీరు ఎంతో శ్రమ పడతారు. కానీ, క్రమక్రమేణా మీరు విద్యావంతులై డిగ్రీ స్థాయికి వచ్చేటప్పటికి ఈ A B C D లు చిన్నవిషయముగా కనిపిస్తాయి మనకు. ఈనాడు భారతీయ విద్యలు భౌతిక విద్యలుగా రూపొంది ఈ విద్యావిధానములో సరైన నైతిక లక్షణములు లేకపోవటం చేత మానవత్వమును పూర్తి మరచిపోతున్నాము. మన హితమైన ధర్మాన్ని మనం విస్మరించిపోతున్నాము. ఏమిటి ఈ M.A. లు B.A. లు MAD, BAD ఇవేనా మనం నేర్చుకోవలసినది. ఇవన్నీ మనలను పెడమార్గం పట్టిస్తున్నవి. కేవలం పొట్టకూటి నిమిత్తమై మనము ఈ చదువులు చదువుతున్నామేగానీ హృదయాన్ని పండించుకునే కోసమని, మనస్సు నిండించుకొనే కోసమని మనమీ చదువులు చదవటం లేదు. మనస్సు నిండాలి. హృదయం పండాలి. అప్పుడే జ్ఞానం హృదయావేశంగా వస్తుంది. డిగ్రీలు తీసుకొని ఎంప్లాయిమెంటు ఆఫీసులో రిజిష్టరు చేస్తాడు. దానికి తిరగటం లోపలే కాలము వ్యర్థము చేస్తాడు. ఇది కాదు మనము చేయవలసినది. ఈ భౌతిక జీవితమునకు, ఈ లౌకికమైన బ్రతుకుకు విద్యలవసరమే. కానీ, ఎంత కాలమైనా సరైన గుణాలను చేకూర్చదు. అన్నింటికీ మానవతా విలువలైన సత్యధర్మశాంతిప్రేమలు అత్యవసరం.

సత్యధర్మశాంతిప్రేమలు లేకున్న
విద్యలన్నియు నేర్చి విలువ సున్న
సత్యధర్మశాంతిప్రేమలు లేకున్న
దానధర్మాల సార్థకత సున్న
సత్యధర్మశాంతిప్రేమలు లేకున్న
పదవులనేలిన ఫలము సున్న
సత్యధర్మశాంతిప్రేమలు లేకున్న
బహుళ సత్కార్య లాభంబు సున్న
ఈ సనాతన ధర్మహర్మ్యంబు నిలువ
గుణములివి నాల్గు పునాది గోడలప్పు.

ఈ నాలుగు గోడల మధ్యనున్న జీవితము మనది. ప్రతి నివాసమునకు నాలుగు గోడలుండాలి. ఈ నాలుగు గోడల మధ్య జీవించేదే మన జీవితము. ఈనాడు గోడలు కూలిపోయినాయి. నివాసము జరగలేకపోతున్నాది. కేవలము చెట్టునీడ, గట్టునీడ మన జీవితము గడుపుతున్నాము. ఇదా మానవత్వము? పక్షులు బ్రతకటం లేదా? క్రిమికీటకాదులు బ్రతకటం లేదా? అవి ఏ బ్యాంకు బ్యాలన్సు పెట్టుకుంటున్నాయి? ఏ భవనములు కట్టించుకుంటున్నాయి? ఏమీ లేదు. రేపు ఏమిటనే చింత పక్షులకు లేదు. కానీ, మానవుడు పంచవర్ష ప్రణాళికలు .యింకా వృద్ధి చేసుకుంటూనే వుంటాడు. కానీ, పశుపక్షిమృగాదులు ఆనందంగా వుంటాయి.

జానెడు పొట్ట నింపుకొన చిక్కులనొందుచు కోటి విద్యలన్
పూనికమీర నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక యీ
మానవజాతి దుఖముల బ్రుగ్గగనేటికి శ్రీపరాత్పరున్
ధ్యానము చేయు భక్తులకు దారిని చూపకయున్నె మానవా!

ఏమిటి మనము చేస్తుండేది?

నిద్దురనుండి మరి నిద్దురపోయెడుదాది పొట్టకై
హద్దును పద్దు లేక వ్యయమందగజేయుచు జీవితంబు నీ
విద్దెల ధారపోసి అరవిధ దళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచనచేయు మానవా!

మొట్టమొదట మనకు కావలసినవి నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికము. ఇవే ఐదు ప్రాణములలో మూడు

ప్రాణములు. ఈనాడు ప్రపంచములో నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికములు అడుగంటిపోయినవి. ఎక్కడ చూచినా కనిపించటం లేదు. ధర్మము, న్యాయము అడవిపాలైపోయినాయి. అన్యాయఅక్రమఅనాచారములంతా గ్రామములలో నిండిపోయినాయి. ఏ రోగమునకైనా నివారణకు మందున్నదిగానీ ఈ రాగద్వేషములకు మందు లేదు. కారణం ఏమిటి? స్వార్థము, స్వప్రయోజనమే.

విద్యర్థులారా! స్వార్థము అవసరమే. స్వప్రయోజము అవసరమే. కానీ, పరిమితము వుండాలి. ఈ పరిమితము లేక అపరిమిత ఆశల చేత మన జీవితము అపరిమితమైన దుఃఖమును అనుభవించుచున్నది. ఏమిటి ఈ పాంచభౌతిక దేహమునకు సుఖము? ఏమిటి సుఖము, తినటము సుఖమా? నిద్రించటము సుఖమా? పిల్లలను కనటము సుఖమా? ధనము సంపాయించుట సుఖమా? లేదులేదు. దేనియందూ సుఖము లేదు. ఆ సుఖములన్నీ క్షణభంగురములు.

మాకురు ధనజనయవ్వన గర్వం అరతినిమేషా కాలాస్సర్వం
మాయామిదమఖిలంహిత్వా బ్రహ్మపదం

క్షణములో పోతున్నాయి యివన్నీ. పిల్లలు మీరనుకుంటారు, పెద్దపెద్ద డిగ్రీలు తీసుకోవాలి, డాక్టరు, ఇంజనీరు, ఎంబిఏ. ప్యాసైనప్పుడు సంతోషము అనుభవిస్తున్నారు. కానీ, ఆనందముందా? లేదు. తరువాత ఉద్యోగము కావాలి. ఉద్యోగము చిక్కుతే ఆనంధము అనుకుంటున్నావు. ఉదోగ్యం చిక్కింది. ఆనందముందా? ఒక నెల, రెండు నెలలు సంతోషం. తరువాత ప్రమోషన్ కావాలి. ప్రమోషన్‌కు ఆశ పడతాడు. ప్రమోషన్ వచ్చిందగానీ ఆనంధము లేదు. తరువాత వివాహము కావాలి. అది ఆనందమనుకుంటారు. వివాహము అయింది. ఆనందముగా లేదు. ఒక కుమారుడు కావాలి అంటాడు. కుమారుడు పుట్టాడు. ఆనందముందా? తరువాత కుమార్తె కావాలి. బిడ్డ పుట్టింది. ఆనందముందా? అప్పటినుండి ఆలునొగలకు జగడాలు. అప్పుడు భగవతుడు జ్ఞాపకము వస్తాడు. ‘ ఓ దేవుడా! ఎందుకీ చింతనలో పడితిని? నా కష్టములు నివారణచేయి’ అని ప్రార్థిస్తాడు. అన్నీ తాను కోరుకున్నవే. కోరుకొన్న దానిలో యేదీ శాశ్వతమైన ఆనందము య్యిలేదు. అన్నీ కదలిపోయే మేఘాలవలె పోతున్నాయి. ఎప్పుడు నీకు ఆనందము? వృద్ధాప్యము వచ్చింది. పిల్లల బాధ్యతలు తీర్చివేసినావు. అప్పుడుకూడా ఆనందము లేదు. కట్టకడపటికి ఎవరి చేతులో చిక్కుతానోయేమో, ఏరోగము వస్తుందోయేమోనని అక్కడకూడా విచారమే. తొంభై సంవత్సరములు వచ్చాయి. మంచముపై పడ్డాడు. అప్పుడూ సుఖము కావాలనే కోరుతున్నాడు. డాక్టరు వచ్చి ఇంజక్షను యిస్తే ‘నొప్పి కాకుండా యివ్వండి’ అంటాడు. సుఖం కావాలి అక్కడ కూడా. పుట్టినప్పటినుండి గిట్టునంత వరకు సుఖంసుఖం. ఎక్కడ సుఖం వుంది? అందువలనే త్యాగరాజు చెప్పాడు, ‘నిధి సుఖమా? ఈశ్వర సన్నిధి సుఖమా? నిజముగ తెలుపుము మనసా’. ధనకనకవస్తువాహనాదులు అన్నీ వచ్చాయి ఇంటికి. అన్నింటిని త్యజించాడు. ఈశ్వర సన్నిధి చాలా సుఖము. అన్నీ మనం అనుభవించ వలసినదే. కానీ, లక్ష్యమును పారమార్థికములో వుంచుకొని ప్రకృతిని అనుభవించండి, తప్పు లేదు. లోకసంబంధమైన సుఖములు అవసరమే. కానీ, మితిమీరిన సుఖములు కోరకూడదు. ఎంతవరకో అంతవరకే. అవసరమైనంత మాత్రమే వుండాలి. గాలి పీల్చుకుంటున్నాము. పీల్చిన గాలి తిరిగి విసర్జించాలి. ఆ గాలిని అట్లే నిలుపుకోటానికి వీలుకాదు. అదేవిధముగా ధనము సంపాయించాలి. ఆ సంపాయించిన ధనము త్యాగము చేయాలి. దానమో, ధర్మమో చేసి సద్వినియోగము చేయాలి. మన భారతీయ సంస్కృతి అనాది కాలమునుండి చక్కని పాఠము చెబుతూ వచ్చింది. న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః. ఎన్ని యజ్ఞయాగాది క్రతువులు చేసినప్పటికీ, ఎంతమంది పిల్లలు నీకు కలిగినప్పటికీ, ఎంత నీవు సంపాయించినప్పటికీ త్యాగములో వుంటున్నది అమృతత్వము. త్యాగములో వుంటున్నది మనకు ఆనందము. త్యాగములో వుంటున్నది మనకు అమరత్వము. త్యాగములోనున్న ఆనందము మరొక దానిలో లేదు. ఏమిటి త్యాగము చేయాలి? ఇల్లు త్యాగము చేయాలా? ఆస్తిపాస్తులు త్యాగము చేయాలా? కాదుకాదు. భగవంతుడు నిన్నేమీ త్యాగం చేయమని చెప్పటం లేదు. దుర్గుణములు త్యాగం చేయి. నీ సద్గుణములను భగవంతుడు యేమాత్రం కోరట్

లేదు. నీ దుర్గుణములు భగవంతునికి అందించండి. దుర్గుణములు ఎవరూ అందుకోరు. 'తల్లిదండ్రులు ప్రేమతో వున్నారు. భార్యబిడ్డలు ప్రేమతో వున్నారు' అని మీరు భావిస్తున్నారు. చాలా పొరపాటు. అందరికంటె గొప్ప ప్రేమ భగవంతుకే వుండేది. పిల్లవాడు అభివృద్ధియై దండిగా ఇబ్బు సంపాయించి సుఖపెట్టాలని యేదో ఒక స్వార్థము లక్ష్యమునందుచుకొని తల్లిదండ్రులు ప్రేమిస్తున్నారు. భార్యాబిడ్డలుకూడా అదేరీతిగా మిమ్మల్ని ప్రేమిస్తున్నారు. కానీ, ఏ స్వార్థము, ఏ స్వప్రయోజనము లేకుండా ప్రేమించేది ఒక్క భగవంతుడు మాత్రమే. అట్టి స్వార్థరహితమైన భగవంతునికి మీ దుర్గుణములు అర్పితము చేయాలి. భగవంతునికి సద్గుణములు చేయమని చెప్పటం లేదు. ఒక నూరు రూపాయలనోటు పనికిరానిదిగా వుంటున్నాది. చాలా మాలిన్యముతో వుంటున్నాది. చూడటానికి అసహ్యముగా వుంటున్నాది. ఎవ్వరూ దీనిని అంగీకరించరు. అదే నూరు రూపాయల నోటు రిజర్వుబ్యాంకుకి యియ్యి. వారు దీనిని తీసుకొని మంచి నోటు యిస్తారు. నీ మలినమైన మనస్సును ఎవ్వరూ అంగీకరించరు. తల్లి, తండ్రి, భార్య, పుత్రులు ఎవరూ అంగీకరించరు. భగవంతునికి అందిస్తే నీకు మంచిని అందిస్తాడు. భగంతుడే రిజర్వుబ్యాంకు. మీ దుర్గుణములు దానిలో పెట్టండి. మిమ్మల్ని బాధించవు. మీకు సుఖము, జగత్తుకు సుఖము. చెడ్డ మీ దగ్గర పెట్టుకోకండి. ఎవరికీ అందించకండి. భగవంతునికి అర్పితము చేయి. అన్ని కర్మలూ భగవత్ప్రీత్యర్థం. అంతా అర్పితము చేయి. నీ కర్తవ్యము నీవు నిర్వర్తించు. అర్పితము అంటే ఏ పనీ చేయకుండా సోమరిగా కూర్చోమని కాదు. నీవు చేసే సర్వ కర్మలూ భగవంతునికి అర్పితము చేయి. ఫలితము తానే అందిస్తాడు. వ్రసే లెటరు వ్రాయవలసిందే. కవరు తీసుకొనిపోయి పోస్టాఫీసులో వేయవలసిందే. అంతవరకే నీ కర్తవ్యము. అమెరికాకో, జపాన్‌కో, జర్మనీకో దానిపాటికి అదే పోతుంది. నీవు యేమీ యోచన చేయనక్కర లేదు. అదేవిధంగా మీరు మీ ప్రాకృత కర్మలు ఆచరించండి. భగవంతునికి అర్పితము అనే కవరును అందించండి. ఈ భగవంతుడు ఎక్కడ చేర్చాలో, ఏవిధమైన సుఖమును మీ కందించాలో తానే అందిస్తాడు. ఆ నమ్మకము ఈనాడు లేకుండా పోతున్నాది. విశావసము అత్యవసరము. విశ్వాసము లేకపోతే శ్వాసము లేని జీవితమే. ఆ విశ్వాసము ప్రేమతో కూడిన విశ్వాసముగా వుంటుండాలి. ప్రేమ లేక ప్రయోజనము లేదు. ఒక విద్యార్థి వుండేవాడు. ఆ విద్యార్థి సమీపములో అడవిలో ఒక చిన్న ఆశ్రమము కట్టుకొని నివసిస్తూ వుండేవాడు. ఈ పిల్లవాడు ఉదయం వెళ్ళటము, తిరిగి సాయంకాలము యింటికి రావటము. గురువు చెప్పాడు.

మాతానాస్తి పితానాస్తి నాస్తిబంధుసహోదరః
అర్థంనాస్తి గృహంనాస్తి తస్మాత్ జాత్ర జాగ్రత
జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునఃపునః
అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత

ఇవన్నీ చెబుతుంటే ఈ పిల్లవాడు అనుకున్నాడు, 'స్వామీ! ఇతరులకు అదంతా సరిపోతుందిగానీ మాబోటి వారికి యిది చెల్లదు' అన్నాడు. 'లోకములో ఎంతమందో అలాంటి వారు వుండవచ్చు. నా తల్లిదండ్రులు అలాంటివారు కాదు. నేను లేక నా భార్య భోజనం చేయదు. నా తల్లిదండ్రులు నేను రావటం ఆలస్యమైతే తలుపు దగ్గర కాచుకొని వుంటారు. అంత ప్రేమతో వుంటున్నారు నాపైన. కాబట్టి మాతానాస్తి పితానాస్తి అని చెప్పటంలో అర్థం లేదే' అన్నాడు. 'ఇదుగో చూడు ప్రత్యక్ష ప్రమానంగా నిరూపిస్తాను' అన్నాడు గురువుగారు. ఒక మాత్ర యిచ్చాడు. 'నీవు ఇంటికి పోతూనే ఆ మాత్ర వేసుకో. నీవు చచ్చిపోయినట్లు కనిపిస్తావు. కానీ, ఎవరెవరు యేమి మాట్లాడుతున్నదీ నీకు తెలుస్తుంది. బాహ్య ప్రపంచానికి నీవు ప్రాణము లేనివాడుగా కనిపిస్తావు. అప్పుడు నీవు సత్యాన్ని గుర్తించు' అని చెప్పాడు. యువకుడు యింటికి వెళ్ళాడు. వేసుకున్నాడు, పడిపోయాడు. తల్లి వచ్చింది. తండ్రిని పిలిచింది. కేకలు వేసింది. 'అయ్యో! కుమారుడు మరణించాడు' అని ఏడుస్తున్నాది. ఈ మాట విని భార్యపరుగెత్తుకొనీ వచ్చింది. అయ్యో, నా గతి ఏమిటని ఆమె ఏడుస్తున్నది. 'నా తల్లికి నేను ఒక కుమార్తెనే. నా భర్త ఈవిధముగా అయిపోతే నా గతి ఏమిటి?' అన తీఏడుస్తున్నాది. మంచి పిల్లవాడే, ఆధ్యాత్మిక మార్గములో జీవితాన్ని గడిపేవాడని అందరికీ దుః

ఖము వచ్చింది. ఈ సమయములో స్వామి వచ్చారు. సరైన సమయానికి స్వామి వచ్చారని అందరూ దారి విడిచారు. 'అమ్మా! ఎందుకోసం ఏడుస్తున్నావు?' అని తల్లిని అడిగాడు. 'నా కుమారుడు మరణించాడు, స్వామీ!'. భార్యను అడిగాడు ఎందుకోసం ఏడుస్తున్నాని. 'ఇతను నా భర్త. అతను పోతే నా గతి ఏమిటి?' తండ్రితో లోపలకు వెళ్ళి టంబ్లరుతో నీరు తీసుకురమ్మన్నాడు. కండ్లు మూసుకొని కొంచెం నాటకం ఆడాడు. 'నీరు ఎవరు త్రాగితే వారు చనిపోతారు, పిల్లవాడు బ్రతుకుతాడు' అని భార్య ప్రీతికరమైనదని భార్య కిచ్చాడు నీరు త్రాగమని. ' నా తల్లిదండ్రులకు నేను ఏకైక పుత్రికను. నేను పోతే నా తల్లిదండ్రులు ప్రాణం తీసుకుంటారు. కాబట్టి నేను త్రాగను' అంది. ' నీ భర్త బ్రతుకుతాడు, నీవు చావు తప్పేముంది' అన్నాడు. ' చచ్చేవాడు ఎట్లైనా చచ్చాడు. పోతేపోనీ. నేను త్రాగను' అంది. తల్లికి చూపించాడు త్రాగమని. 'అయ్యో! నాయనా! ఇంటికి నా బిడ్డ ప్రసవానికి వచ్చింది. ఆమెను చూచేవారు లేరు. ఇంకా యిద్దరు ఆడబిడ్డలుంటున్నారు. వారి పెండ్లిండు, కావలిసినన్ని నా భాద్యతగా వుంటున్నాయి. నేనెట్లా చచ్చిపోయేది'. సరే, తండ్రిని అడిగాడు. యోచన చేశాడు. 'ఇంటి పెద్దను నేను. ఇద్దరూ ఆడవరే మిగిలిపోతారు. ఇంటిలో మగదిక్కేలేదు. నేను ఎట్లా చచ్చేది?' అన్నాడు. ముగ్గురూ ఒప్పుకోలేదు. ముగ్గురూ లోపలికి వెళ్ళారు. మాష్టరు ప్లాను వేశారు. 'స్వామీ! మీరు ఎంతో దయామయులు. మీకు ఎట్టి బాధ్యతలు లేవు. ఈ నీరు మీరే త్రాగు నా కుమారుని బ్రతికించండి. మీకు మంచి పాలరాతి సమాధి కట్టిస్తాము'. అప్పుడు వీడు లేచాడు. 'చూశావా! నీ భార్య ఏమి చెప్పింది? తల్లి ఏమి చెప్పినిది? తండ్రి ఏమి చెప్పాడు? కట్టకడపటికి నన్నే చావమని చెప్పారు'. జగమంతా మిథ్యము. జన్మ దుఃఖం, జాయా దుఃఖం పునఃపునః, అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత. ఎవరికి ఎవరూ లేరు. దేహాభిమానము వుండినంతవరకే దేహమును ప్రేమిస్తారు. ఇదికూడా స్వార్థము కోసమే. ఎట్టి స్వార్థము రీని, నిస్వార్థమైనవాడు భగవంతుడొక్కడే. అట్టి భగవంతుని మీరు ప్రేమించి మిగిలిన సంబంధములను మీరు పోషించుకోండి. తప్పులేదు. ఏ పని చేసినా అది భగవత్కార్యముగా భావించండి. ఎవరిని చూచినా దైవముగా విశ్వసించండి. అందరియందున్నది భగవంతుడే. ఎవరినీ తూలనాడరాదు. ఎవరినీ ద్వేషించరాదు. ఎవరితో మనం అధిక విశ్వాసముతో వుండరాదు. అందరి విశ్వాసములు భగవంతునిపై పెట్టండి. ఇది ఎన్నో దారాలు చేరిన బట్ట. అన్ని దారాలు చేరటటం వలన చాలా బలంగా వుంటున్నాది. ఒక్కొక్క దారము విడివిడిగా తీస్తే వేళ్ళతో త్రుంచవచ్చు. కాబట్టి అందరి ప్రేమను భగవంతునిపై పెట్టాలి. అందరిని భగవత్స్వరూపంగా విశ్వసించు. అందరిని ప్రేమించు. అందరిని విశ్వసించు. అంతేగానీ ఎవరినీ నమ్మరాదు. ఒక్క దైవమును మాత్రమే నమ్మాలి.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగదేహికి చావుపుట్టుకల్
మోహనిబంధబంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ.

క్షేత్రమిది. లోపలునాన్నదు క్షేత్రజ్ఞుడు.

మలినపు కొంప రోగముల మ్రగ్గెడి సేవకగంప జాతసం
చలనముపొందు దుంప భవసాగరమీదగ లేని కంప అం
బులపొదిలెమ్ము చూడమన మెప్పు దలంపగ దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే!

ఈనాడు రూపనామములలో, ఇప్పటి పరిస్థితియందు, ఈ కలియుగమందు ఇది చాలా అవసరము. ఆ విశ్వాసము మనం కోల్పోవటం చేత దేశము యిన్నవిధములైన అల్లకల్లోలములతో కుమిలిపోతున్నాది. నైతిక విలువలు పెంచుకోండి. ధార్మిక మార్గములో ప్రవేశించండి. ఆధ్యాత్మికము అనుభవించండి. లౌకికము మీకు సుఖంగా వుంటుంది.

విద్యార్థులారా! మీకు కళాశాలయందు ఆధ్యాత్మికముయొక్క సంబంధము యేమాత్రమూ లేకపోవటం చేత మీ మనస్సు ఈవిధంగా పెడమార్గములు పడుతున్నాది. మీ దోషము కాదు. విద్యలోని దోషము. ఎందుకంటే ఆధ్యాత్మికము విద్యలో ఏమాత్రమూ లేకపోతున్నాది. ఆధ్యాత్మికమైన పునాది లేక ఈ భవనము ఎట్లా నిలవగలదు? కాబట్టి, self-confidence foundation, self-satisfaction wall, self-sacrifice roof, self-realisation life. ఆత్మవిశ్వాసం ప్రధానము. ఇది లేక ఏ చిన్న కార్యము మనము సాధించ లేము. మీకు సమయము చిక్కినప్పుడు పొద్దుపోని మాటలు మాట్లాడక కాలము వ్యర్థముగావించక మీయొక్క కాయమును పెడమార్గము పట్టించకుండా, లేని దుర్మార్గ భావములు మీ తలలో చేర్చకుండా సమయము చిక్కినప్పుడు భగవచ్చింతన చేయండి. అట్టి శాశ్వత ధనమును మీరు సంపాయించాలి. శాశ్వత కీర్తిని మీరు సంపాయించాలి. అప్పుడే జీవితము సార్థకమవుతుంది. సమాజములో ప్రవేశించండి. సమాజ సేవలో పాల్గొనండి. వారి వారి ప్రేమకు మీరు పాత్రులుకండి. అహంకారము నిర్మూలము చేసుకోండి. దేహము ఎందుకోసం వచ్చింది? ధర్మము ఆచరించేకోసము వచ్చింది. కనుక, మీరు నిత్యము శ్రవణము చేసిన విషయములు ఏ ఒక్కటి రెండైనా హృదయములో దాచుకోండి. అన్నీ దాచుకోటానికి ఈ పెట్టెలో స్థలము వుండదు. ఒకటి రెండు ముఖ్యమైనవి మీరు దాచుకోండి.

భజనబినా సుఖశాంతినహి.....